క్లుప్తంగా

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

రేపల్లె రూరల్: మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు. ఆగస్టు 15న జంతువధ నిషేధించినట్లు చెప్పారు.

ఎస్ఐ రవికృష్ణ బాధ్యతలు స్వీకరణ



వేమూరు: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐగా రవి కృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రాజశేఖర్ బదిలీపై వీఆర్‌కు వెళ్లారు. వీఆర్‌లో ఉన్న రవికృష్ణ ఇక్కడకు వచ్చారు. పని చేస్తు బదిలీపై వేమూరు వచ్చారు. స్టేషన్ సిబ్బంది అభినందించారు.

చుండూరు ఎంపీడీఓ సుగుణమ్మ..



చుండూరు(వేమూరు): చుండూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.సుగుణమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీపై ప్రకాశం జిల్లా కొనకనమెట్ల వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఆమెను కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల రికార్డుల తనిఖీ



ఆళ్లమూడి(భట్టిప్రోలు): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ టి.ఊహారాణితో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని పరిసరాలు, విద్యార్థుల నివేదికలు పరిశీలన చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, విద్యార్థుల పురోగతి, మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఆరా తీశారు. అలాగే పాఠశాలలోని వంట గదిని కూడా పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.ఊహారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమావేశ మందిరంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అధికారులు పక్కా సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

కనుల పండువగా పోలేరమ్మ కొలుపులు



బాపట్లటౌన్: మండలంలోని ముత్తాయపాలెం పల్లిపాలెంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న పోలేరమ్మ అమ్మవారి కొలుపులు మంగళవారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా గ్రామంలోని పురుషులు మహిళల వేషధారణ(పాప వేషాలు) ధరించి అమ్మవారికి అత్యంత ఇష్టమైన కనకతప్పెట్లు, మేళా తాళాల నడుమ అమ్మవారిని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన పాల పొంగళ్లు పొంగించి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.

మత్తు పదార్థాలతో బంగారు భవిష్యత్ నాశనం



రేపల్లె రూరల్: మత్తు పదార్థాలు తీసుకోవటంతో బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవటమేనని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర అన్నారు. నిషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుత ఖైనీ, గుట్కా, నాటుసారా, తంబాకు వంటి పదార్థాలు తీసుకోవటంతో అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. ఎన్‌సీసీ విద్యార్థులు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వర్మీ కంపోస్ట్ విధానాన్ని అమలు చేయాలి

భట్టిప్రోలు: వర్మీ కంపోస్ట్ విధానాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో అమలు చేయాలని ఎంపీడీఓ టి.ఊహారాణి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారానికి రెండోరోజుకు చేరింది. ఆళ్లమూడి, కోనేటిపురం గ్రామ పంచాయతీలలో శిక్షణ చేపట్టారు. మెరుగైన పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థంగా నిర్వహిస్తున్న ఈ రెండు గ్రామాల్లోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలలోని వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రలు పాల్గొన్నారు. మూడో రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నారు.

సర్పంచులకు రెండో రోజు శిక్షణ

అమృతలూరు(వేమూరు): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏఓ వాణి ఆధ్వర్యంలో అమృతలూరు మండలం కూచిపూడిలోని వర్మీ కంపోస్టు తయారు షెడ్డును పరిశీలించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, తడి, పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేయడంపై అవగాహన కల్పించారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల విధులు– బాధ్యతలపై మండలంలోని పేటేరు పంచాయతీలో మంగళవారం శిక్షణ తరగతులు రెండోరోజు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రజలను చైతన్య చేయాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్యంతో పాటు తాగునీరు, విద్యుత్‌దీపాలు, రహదారులు తదితర అంశాలతో పాటు పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు నడిచే తీరుపైన దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామంలోని పంచాయతీ కార్యలయం, ఘన వ్యర్థాల నిర్వహణ చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పుష్పకుమారి, సర్పంచి కనపర్తి వసుమతి పాల్గొన్నారు.



కూచిపూడి గ్రామంలో వర్మీ కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న సర్పంచులు



కోనేటిపురం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



పేటేరులో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

చిన్నారులను అభినందించిన ఎస్పీ తుషార్‌డూడి

బాపట్లటౌన్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం సాయంత్రం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో చిన్నారులను అభినందించారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ యోగ అంటే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు సాధించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. చీరాలకు చెందిన యోగా టీచర్ వి.సుబ్బారావు నేతృత్వంలో శిక్షణ పొందిన చీరాల భాష్యం, నారాయణ, విజ్ఞాన భారతి పాఠశాలల విద్యార్థులు ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో విజయం సాధించి, రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించగా సెప్టెంబర్ 14,15 తేదీల్లో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. చిన్నారులు యోగా క్రీడాకారుల పోటీల్లో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించడం గర్వకారణమన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ఆర్డీఓ హెలా షారోన్

రేపల్లె రూరల్: భూ వివాదాలు, రెవెన్యూ పరమైన అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆర్డీఓ హెలా షారోన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, అధికారులతో మంగళవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు 16వ తేదీ నుంచి 45 రోజుల పాట డివిజన్ పరిధిలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో సదస్సుల నిర్వహణ షెడ్యులును ఏర్పాటు చేసి గ్రామాలలో ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు. సదస్సుల్లో వచ్చిన ప్రజల నుంచి వచ్చిన సమస్యలను రికార్డులలో పొందుపరిచి పరిష్కరించాలని ఆదేశించారు. మండలస్థాయిలో పరిష్కారంకాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ హెలా షారోన్

జాతీయస్థాయి తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

నిజాంపట్నం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో తీరప్రాంత విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించిన పోటీల్లో నిజాంపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కార్తికేయ ప్రతిభ చూపాడు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో అభినందన సభ మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం శివన్నారాయణ మాట్లాడుతూ బోధిధర్మ అకాడమీ విద్యార్థులు పాల్గొని స్వర్ణ పతకాలు సాధించడం మంచిపరిణామమన్నారు. తమ స్కూల్ విద్యార్థి కార్తికేయ పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాతలు సహకరించాలని కోరారు. అనంతరం కార్తికేయను పాఠశాల ఉపాధ్యాయులు, పీడీ కుటుంబరావు, ఎంఎస్ నాగలక్ష్మి అభినందించారు.



కార్తికేయను అభినందిస్తున్న హెచ్‌ఎం శివన్నారాయణ, వెంకటేశ్వరరావు

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెరవలి(వేమూరు): జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. గ్రామంలో ఇంటింటి జ్వర పీడితులు గుర్తించేందుకు సర్వే మంగళవారం నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. నిల్వ ఉంటే దోమల ద్వారా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. జ్వరాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వెంటనే వారికి మలేరియా, డెంగీ పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం కార్యక్రమాలకు గ్రామ సర్పంచులు, ఎంపీడీవో, మండల పంచాయతీ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా సహకారించాలని ఆయన కోరారు.



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

అవయవ దానం ఎంతో ముఖ్యం

బాపట్ల: ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్ల కొత్త బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఇకో హౌస్‌లో రక్తదాన, అవయవ దాన శిబిరం మంగళవారం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్ క్రాస్ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం రక్తదానంతో ప్రారంభమై సాయంత్రం వరకు అవయవదానం, శరీర దానం రిజిస్ట్రేషన్‌లతో కార్యక్రమాన్ని కొనసాగించారు. రక్తదానం 16 మంది, అవయవ దానం 50 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ శరత్ బోసు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఇంకా ముందు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హక్, బీఎస్ నారాయణభట్టు, రిటైర్డు అధ్యాపకులు డాక్టర్ సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టరు శరత్‌బోసు

సృజనాత్మకత వెలికితీసేందుకే క్విజ్ పోటీలు

చెరుకుపల్లి: విద్యార్థుల సృజనాత్మకత వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతో దోహదపడతాయని ఏపీఎస్ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ మనదేశ స్వాతంత్య్రం కోసం సమరయోధులు చేసిన త్యాగాలను నేటి తరం విద్యార్థులకు తెలియ జేసేందుకే ఈ క్విజ్ పోటీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీలు 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులను మాత్రమే ఒక టీమ్‌గా పరీక్ష నిర్వహించటం జరిగిందన్నారు. పోటీ పరీక్షకు 25 టీంలు పాల్గొన్నట్లు మురళీ తెలిపారు. పోటీలో మొదటి బహుమతి జెడ్పీహెచ్ఎస్ గుళ్లపల్లి, రెండో బహుమతి వీపీ జీఎస్ఎం హైస్కూల్ సూరేపల్లి, మూడో బహుమతి జెడ్పీహెచ్ఎస్ పెసరలంక, మరియు ప్రోత్సాహక బహుమతులు స్థానిక పాఠశాల హెచ్‌ఎం కె.కవిత చేతులమీదగా విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో కాటూరి లక్ష్మీనారాయణ, కూచిభట్ల శ్రీనివాస్ శర్మ, బొలగాని వెంటేశ్వరరావు, మందపాకల వెంకట సాంబశివరావు పాల్గొన్నారు.



క్విజ్ పోటీలో బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు కష్టపడి చదవాలి

న్యాయమూర్తి జి.రేణుక



బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్న తస్థితికి చేరుకోవాలని బాపట్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రేణుక పేర్కొన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. జడ్జి రేణుక పలు సూచనలు చేయగా వాటిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల వసతి గృహం, కిచెన్, విద్యార్థుల మెనూ తనిఖీ చేసి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ - పంట నమోదు పరిశీలన



అమృతలూరు(వేమూరు): సాగు చేస్తున్న పంటలను రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని తహసీల్దారు కె.నెహ్రూబాబు అన్నారు. అమృతలూరు మండలంలోని తురిమెళ్లలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయడంతో ఉచిత పంట బీమా పథకం, అన్నదాత సుఖీభవ పథకం, పంట నష్టం జరిగిన సందర్భంలో పంట నష్ట పరిహారం పొందడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రుణాలు పొందటానికి ఈ పంట నమోదు తప్పని సరిగా ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐ.శ్రీకాంత్, డి.బాల భాస్కర్, వ్యవసాయ సహాయకులు పి.స్వర్ణలత పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయ విధానం అవలంబించడం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధ్యమని జీఎస్ పాలెం యూనిట్ ఐసీఆర్‌పీ చేబ్రోలు ఏసోబు తెలిపారు. పిట్టలవానిపాలెం మండల కేంద్రంలో మంగళవారం ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్రవజీవామృతాన్ని తయారు చేసేందుకు రెండు కిలోల పప్పు దినుసుల పిండి, రెండు కిలోల నల్లబెల్లం, 10 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల ఆవు మూత్ర, 150 లీటర్ల నీరు, గుప్పెడు పుట్టమన్ను అవసరమవుతాయని వివరించారు. ప్లాస్టిక్ డ్రమ్ములో కలియబెట్టాలని ఈవిధంగా చేసిన తర్వాత ఐదు రోజుల్లో ద్రవజీవామృతం సిద్ధమవుతుందని చెప్పారు. ద్రవజీవామృతాన్ని వరి పైరుపై పిచికారీ చేయడం వల్ల భూమి గుల్లబారి సూక్ష్మజీవులు వృద్ధి చెంది మొక్కల బలంగా పెరుగుతుందని తెలిపారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

భట్టిప్రోలు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ సోషల్ స్టడీస్ ఫోరం(ఏపీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో భట్టిప్రోలు మండలానికి చెందిన హైస్కూలు విద్యార్థులు సత్తా చాటారు. క్విజ్‌లో సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. అలాగే పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన ఆరేపల్లి బాల వెంకట శ్రీనివాస్, మురాల హర్షమణికంఠ, పెనుమాల ఆదర్శ్‌బాబు, టి.సుహిత, ఎం.భవ్యశ్రీ, ఎం.తేజశ్రీలను ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలు కూచిభొట్ల శ్రీనివాస శర్మ, ఎస్‌కే మహబూబ్ బాషా అభినందించారు.



ప్రతిభ పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



భట్టిప్రోలు: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన గౌరిపర్తి అర్జునరావు(45) ఈ నెల 11వ తేదీన కోడిపర్రులో ఓ ఫంక్షన్‌కు హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో తల వెనుక తీవ్ర గాయమైంది. సమాచారం మేరకు క్షతగాత్రుడ్ని 108లో తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో కుటుంబ సభ్యులు అతడిని తెనాలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు దామోదర గోపీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ రైటర్ ఎస్.నాగరాజు తెలిపారు. మృతదేహానికి తెనాలి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.



పట్టణంలోని దుకాణాల్లో రెపరెపలాడుతున్న మువ్వెన్నెల జెండాలు

పంద్రాగస్టుకు ముస్తాబు

స్వాతంత్య్ర దినోత్సవానికి బాపట్ల ముస్తాబు అయింది. జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే గ్రౌండ్‌ను రంగురంగుల జెండాలతో అలంకరించారు. పట్టణంలోని దుకాణాల్లో మువ్వెన్నెల జెండాలు రెపరెపలాడుతున్నాయి. జాతీయ జెండాలతో పాటు జెండా రంగులతో వివిధ రకాల స్టిక్కర్లు, రిప్పన్లు, డ్రస్‌లు, తోరణాలను దుకాణ యజమానులు ఇప్పటికే సిద్ధం చేశారు. పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాలైన రథంబజార్, గడియారస్తంభం సెంటర్, జీబీసీ రోడ్డు, చీరాల రోడ్డు, ఏజీ కళాశాల రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్‌లో అన్ని ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయించే దుకాణాల్లో మువ్వెన్నెల వస్తువులు మెరుస్తున్నాయి. - బాపట్లటౌన్



ఉత్సవాలకు ముస్తాబవుతున్న పోలీస్ పరేడ్ గ్రౌండ్

ఖాళీ కుర్చీలకు శిక్షణ



ఉన్నత లక్ష్యం నీరుగారుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు ఏర్పాటు చేసిన 'శిక్ష'ణగా మారింది. పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కోసం మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే తొలి రోజు అడపాదడపా హాజరైన రెండో రోజు మంగళవారం అందరూ డుమ్మా కొట్టారు. ఎవరు రాకపోతే మాకేమి అనుకున్నారో ఏమో అధికారులు ఖాళీ కుర్చీలకు శిక్షణనివ్వడం విచిత్రంగా ఉంది.

-పిట్టలవానిపాలెం

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించడం ఆనవాయితీగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండ్లమ్మ వారిని వివాహ ప్రదాయిని మంగళ గౌరీగా అలంకరించారు.

రేపు శ్రీఅరవిందుల జయంతి వేడుక

తెనాలి: అరబిందో ఎడ్యుకేషన్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో శ్రీఅరవిందుల వారి 152వ జయంతి వేడుకలను ఈనెల 15న ఘనంగా నిర్వహించనున్నారు. పట్టణ నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రంలో అరవిందుల జయంతితో పాటు 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహిస్తామని సొసైటీ డైరెక్టర్ కె.సంపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.